నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం | 12 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

పచ్చని పైరును గడ్డి ముందు కొట్టి

# ధ్వంసం చేశారు

**బాధితుడు పసుపులేటి నాగార్జున ఆవేదన**



**జలదంకి, మేజర్‌న్యూస్ :**

జలదంకి మండలంలోని కోదండరాంపురం గ్రామంలో పేద రైతు పసుపులేటి నాగార్జున.. గత 20 ఏళ్ల నుండి 2 ఎకరాల పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అలాగే ఈ ఏడాది కూడా ఆ రెండు ఎకరాల్లో వరి సాగు చేపట్టాడు. అయితే ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో వేములపాడుకి చెందిన కొందరు -మిగతా 2లో

## ఏపీలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన

# అమలు స్థితి ఏంటి ?



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎం-ఎంఎస్‌వై) పథకం అమలు వివరాలు తెలియజేయాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం లోక్‌సభలో ఈ మేరకు పలు అంశాలపై ఆరా తీశారు. అంచనా పెట్టుబడి, చేపల ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ సదుపాయాలు, మార్కెటింగ్ బలోపేతం చేయడం, మత్స్యకారుల సంక్షేమం వంటి వాటిల్లో సమస్యలను అధిగమించడం, పథకం వ్యవధిపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)ను 2020-21 నుంచి 2024-25 వరకు ఐదేళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌తో సహా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేస్తోందన్నారు. 2020-21 నుంచి ఇప్పటివరకు అన్ని రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు రూ.20,990 కోట్ల విలువైన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపామన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.8924 కోట్లన్నారు. ఇక పీఎంఎంఎస్‌వై కింద రూ.559.10 కోట్ల కేంద్ర వాటాతో మొత్తం రూ.2398.72 కోట్ల విలువైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయని వివరించారు. ఇక పథకం అమలులో పలు కీలక ప్రాజెక్టులు చేపట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. 58 ఫిషింగ్ హార్బర్‌లు/ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌లు, 634 ఐస్ ప్లాంట్లు/శీతల గిడ్డంగులు, 2 స్మార్ట్ హోల్‌సేల్ మార్కెట్‌లు, 202 రిటైల్ ఫిష్ మార్కెట్‌లు, 6694 ఫిష్ కియోస్క్‌లు, 27189 యూనిట్లు చేపల రవాణా సౌకర్యాలు, 128 వాల్యూ యాడ్ ఎంటర్‌ప్రైజ్‌ల కోసం ఎంటర్‌ప్రైజ్‌లు, ఇ-మార్కెటింగ్ సదుపాయం వంటివి కల్పించామన్నారు. వీటితో పాటు సుమారు 12 వేలు రీ-సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్, 4,205 బయోఫ్లోక్ యూనిట్లు, 55,118 రిజర్వాయర్ కేజ్‌లు, 5,711 రేస్‌వేలు సమకూర్చినట్లు పేర్కొన్నారు. ఇక పీఎంఎంఎస్‌వై కింద ఆంధ్రప్రదేశ్‌లో 64 రీ-సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్, 97 బయోఫ్లోక్ యూనిట్లు, 471 కేజ్‌లు, 4,715 కియోస్క్‌లు, రిటైల్ అవుట్‌లెట్లు, 9 ఫిషింగ్ హార్బర్‌లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, 16 ఐస్ ప్లాంట్లు, శీతల గిడ్డంగులు ఉన్నాయన్నారు. పీఎంఎంఎస్‌వై పథకం.. చేపల పెంపకం, ఆక్వాకల్చర్ వృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా 2019-20 లో వార్షిక చేపల ఉత్పత్తి 141.64 లక్షల టన్నులు ఉండగా 2022-23 నాటికి 175.45 లక్షల టన్నులకు పెరిగిందన్నారు. ఎగుమతుల విలువ -మిగతా 2లో

లిక్కర్ ధరలు..

# బాదుడే బాదుడు

- బాబుకు పేదల ఉసురు తప్పక తగులుతుంది
- మాజీ మంత్రి కాకాణి వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఒకమాట.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత మరొక మాట చెబుతున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం నెల్లూరు జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ.. లిక్కర్ ధరలు పెంచి చంద్రబాబు బాదుడే.. బాదుడు మళ్లీ షురూ చేశారని ఆరోపించారు. మద్యం ధరలు పెంచిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు పేదల ఉసురు తగలక తప్పదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న షాప్స్‌ని టీడీపీ నేతలకు కట్టబెట్టి ధరలు పెంచేశారని చెప్పారు. లిక్కర్ షాప్స్‌లో పని చేస్తున్న వారిని రోడ్డున పడేశారన్నారు. ఎమ్మెల్యేల కనుసన్నల్లో బెల్ట్‌షాపులు నడుస్తున్నాయని ఆరోపించారు. తక్కువ ధరకే మేలైన మద్యం ఇస్తానని హామీ ఇచ్చి ఉన్నఫలంగా రేట్లు పెంచారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పొడుస్తూ.. -మిగతా 2లో

పల్లె పండుగలో..

# సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



**సైదాపురం, మేజర్‌న్యూస్ :**

సైదాపురం మండలం వేములచేడు, కమ్మవారిపల్లి, సైదాపురం గ్రామంలో 65 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఎంపీపీ, కూటమి నాయకులతో కలిసి ఆయన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ రోడ్డు పనులు నిర్మించడం ప్రభుత్వ లక్ష్యమని, కూటమి ప్రభుత్వంలో గ్రామాలన్నీ అన్ని రకాలుగా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నాయని, తమ ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం గద్దలుతిప్ప వద్ద ఇటీవల వరుస కథనాలతో - 2లో

# ప్రజల ముంగిటకు న్యాయసేవ

- న్యాయమూర్తి వాణి
- వికలాంగుల రక్షణ కోసం వీధుల్లో ప్రచారం


2లో

ఒకప్పుడు న్యాయం కోసం కోర్టు గుమ్మం ఎక్కి ఏళ్ళ తరబడి వేచి చూస్తే తప్ప.. న్యాయ సహాయం లభించని పరిస్థితి. ప్రస్తుతం న్యాయ సహాయం అందించేందుకు సాక్షాత్తు న్యాయమూర్తే ప్రజల ముంగిటకు వచ్చి న్యాయ సేవలు అందించడం విశేషం.

ఫ్లోర్ పాయింట్ల వద్ద

పూలమొక్కల కుండీలను

# ఏర్పాటు చేయండి


వివరాలు 2లో

# ప్రజల ముంగిటకు న్యాయ సేవ

## న్యాయమూర్తి వాణి - వికలాంగుల రక్షణ కోసం వీధుల్లో ప్రచారం



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** ఒకప్పుడు న్యాయం కోసం కోర్టు గుమ్మం ఎక్కి ఏళ్ళ తరబడి వేచి చూస్తే తప్ప.. న్యాయ సహాయం లభించని పరిస్థితి. ప్రస్తుతం న్యాయ సహాయం అందించేందుకు సాక్షాత్తు న్యాయమూర్తే ప్రజల ముంగిటకు వచ్చి న్యాయ సేవలు అందించడం విశేషం. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని పర్యవేక్షణలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి మంగళవారం స్థానిక డైకస్ రోడ్డులో వికలాంగ బాల బాలికల గుర్తింపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సమాజంలో వికలాంగ బాల బాలికలకు సరైన వైద్యం, ఆర్థిక సహకారం, అక్షర జ్ఞానం లభించక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పలు స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా రాష్ట్ర హైకోర్టు దృష్టికి వచ్చింది. దీంతో రాష్ట్ర హైకోర్టు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఉన్న న్యాయ సేవాధికార సంస్థలను ఆదేశిస్తూ.. వికలాంగ బాల బాలికలను గుర్తించాల్సిందిగా ఆదేశించింది. న్యాయమూర్తులే స్వయంగా నగరాల్లో, గ్రామాల్లో, మండలాల్లో పర్యటించి వికలాంగ బాల బాలికలను గుర్తించి వారికి జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ద్వారా విద్య, వైద్యం, అవసరమైన ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఈ నెల 10 నుంచి ఫిబ్రవరి 24 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా వికలాంగ బాల బాలికల కోసం న్యాయమూర్తి వాణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బాల బాలికలకు అవసరమైన వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రం ద్వారా అందిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రాథమిక దశలోనే బాల బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ప్రజలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని న్యాయమూర్తి వాణి సూచించారు. మండలాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, వికలాంగ బాల బాలికలను గుర్తించిన వారు నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని న్యాయమూర్తి సూచించారు. న్యాయమూర్తి వాణి స్వయంగా నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించడం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, ఏఎస్ఐ సతీష్ బాబు, పారా లీగల్ వాలంటీర్లు శ్రీనివాసులు, సురేంద్ర, అంగన్వాడి ఉపాధ్యాయులు సిహెచ్ సుధా, ప్రసన్న, లోక్ అదాలత్ కార్యాలయ సిబ్బంది లీలమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లోర్ పాయింట్ల వద్ద పూలమొక్కల కుండీలను ఏర్పాటు చేయండి

### - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న ఫ్లోర్ పాయింట్లను గుర్తించి, ఆయా ప్రాంతాలను శుభ్రపరిచి అక్కడ పూల మొక్కల కుండీలను ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా మంగళవారం 43వ డివిజన్ కోటమిట్ట, జండా వీధి, కుమ్మరి వీధి, ఫిష్ మార్కెట్ తదితర ప్రాంతాలలో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోటమిట్ట షాదీ మంజిల్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేసి ఉన్న డివైడర్‌పై మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి డివైడర్లు శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైను కాలువల్లో పూడికతీత అనంతరం రోడ్లపై సిల్టును ఉంచరాదని, ఎప్పటికప్పుడు తరలించేయాలని ఆదేశించారు. ప్రధానమైన ప్రాంతాల్లో వ్యర్థాలు వేయకుండా పూల మొక్కలు కుండీలను ఫెన్సింగ్‌తో పాటు ఏర్పాటు చేసినందుకు స్థానిక శానిటేషన్ సెక్రటరీ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లను కమిషనర్ ప్రశంసించారు. ప్రతి సచివాలయ సెక్రెటరీకి 100 పూలకుండీల మొక్కలను అందజేసి వారి డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసుకునేలా, మొక్కలకు రక్షణ కల్పించేలా ఫెన్సింగ్, క్రమం తప్పకుండా నీటిని పోసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను కమిషనర్ సూచించారు. అదేవిధంగా స్థానిక చేపల మార్కెట్ సమీపంలోని సబ్ స్టేషన్ వద్ద ఉన్న ఐలాండ్‌లో గతంలో సూచించిన విధంగా పచ్చదనాన్ని మెరుగుపరిచి అందంగా తీర్చిదిద్దారని, ఇదేవిధంగా మరికొన్ని ప్రాంతాలను గుర్తించి ఐలాండ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్థానిక ఫిష్ మార్కెట్ సమీపంలోని అన్నా క్యాంటీన్ ను కమిషనర్ సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. క్యాంటీన్లోని వాటర్ ప్లాంట్‌ను క్రమం తప్పకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి టోకెన్ విధానం ద్వారానే ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఉద్యాన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్‌కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, ఇంజనీరింగ్ విభాగం ఈ.ఈ, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పొలాన్ని నాశనం చేయడం దారుణం : జనసేన ఉదయగిరి కొట్టే వెంకటేశ్వర్లు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కోదండరాంపురంలో పేద రైతు పసుపులేటి నాగార్జున సాగు చేసుకున్న 2 ఎకరాల వరి పొలాన్ని కొంత మంది కక్ష కట్టి నాశనం చేయడం చాలా దారుణమని ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన జలదంకి మండలంలోని జనసేన నాయకులతో కలిసి కోదండ రామపురంలో నాశనం చేసిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నబిడ్డలాగా కాపాడుకుంటూ వచ్చిన పైరును ధ్వంసం చేయడం చాలా బాధాకరమన్నారు. ధ్వంసం చేసినవారు ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు. బాధిత రైతు పసుపులేటి నాగార్జునకు జనసేన పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. నాగార్జునకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని ఆయన అన్నారు. ఈ విషయంపై జలదంకి పోలీసులతో పాటు జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దూరి శ్రీనివాసులు రెడ్డి, టక్కోలా నారాయణరెడ్డి, జనసేన నాయకులు నిమ్మలపల్లి రామ్‌చైతన్య, వంశీ, పెంచలయ్య, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అమలు స్థితి ఏంటి ?

*(మొదటి పేజీ తరువాయి)*

రూ.46,662 కోట్ల నుంచి 2023-24 నాటికి రూ.60,524 కోట్లకు పెరిగిందన్నారు. ఇక తలసరి చేపల వినియోగం 5-6 కిలోల నుంచి 12-13 కిలోలకు పెరిగిందని పేర్కొన్నారు. ఆక్వాకల్చర్ ఉత్పాదకతను హెక్టారుకు 3 టన్నుల నుంచి నుండి 4.7 టన్నులకు చేరిందన్నారు. చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని, రాష్ట్రంలో చేపల ఉత్పత్తి 2019-20లో 41.74 లక్షల టన్నులు కాగా.. 2023-24 నాటికి 51.58 లక్షల టన్నులకు పెరిగిందని వివరించారు. పీఎంఎంఎస్‌వై కాల వ్యవధి మార్చి 31, 2025తో ముగుస్తున్నందున, కేంద్ర క్యాబినెట్ ఆమోదం మేరకు, 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు పథకాన్ని పొడిగించామన్నారు.

## పల్లె పండుగలో.. సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



*(మొదటి పేజీ తరువాయి)*

అపోహ ఉన్న రైతులకు భరోసా కల్పించిన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ 793 సర్వే నెంబర్లు గద్దలుతిప్ప వద్ద ఉన్న ప్రభుత్వ భూమి దళిత, గిరిజనులు సాగు చేసుకోవాలని, చేసుకుంటున్న భూమిలో నిమ్మ చెట్లు, మరే ఇతర పంటలను తొలగించే ప్రసక్తే లేదని, ఆ భూమిని మైనింగ్ ఇస్తున్నట్లు మండలంలో భారీ ఎత్తున ప్రచారం జరుగుతున్న తరుణంలో సాగు చేసుకుంటున్న రైతులకు తప్ప, మరెవరికి భూములను అప్పగించే ప్రసక్తే లేదని, సాగు చేసుకోవాల్సిన రైతులు సాగు చేసుకోవాలని మంగళవారం మీడియా ముఖంగా తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ, జెడ్పీటీసీ చిత్తలూరు పోలయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కట్ట మోహన్ కృష్ణారెడ్డి, మర్లపూడి యువ నాయకుడు వరదబండి వెంకటేశ్వర్లు రెడ్డి, దిలీప్ నాయుడు, కర్ణం శ్రీనివాసులు నాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు, రాజశేఖర్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, కేపీ రాజు, పార్థ నాయుడు, బీజేపీ జిల్లా నాయకుడు చాందు, వెంకటేశ్వర్లు నాయుడు, వరిగొండ సురేంద్ర, కూటమి నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## లిక్కర్ ధరలు.. బాదుడే బాదుడు !

*(మొదటి పేజీ తరువాయి)*

టీడీపీ నేతలు జేబులు నింపుకునేలా చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి తన సంపద పెంచుకునే పనిలో పడ్డారన్నారు. ఎల్లో సిండికేట్స్ ఏకమై తాగుబోతుల కష్టాన్ని దోచుకుంటున్నారు. మద్యం షాప్స్ దగ్గర నుంచి బెల్ట్‌షాప్స్ దాకా స్థానిక ఎమ్మెల్యేలు కమిషన్స్ వసూలు చేస్తున్నారన్నారు. వందల కోట్ల కమిషన్స్ దండుకోవడంలో భాగంగా చంద్రబాబు మద్యం ధరలు పెంచారన్నారు. చంద్రబాబు ఉండవల్లి నివాసానికి నోట్ల కట్టలు భారీగా వెళ్తున్నాయన్నారు. మద్యం వ్యాపారులతో చంద్రబాబు డీల్ కుదుర్చుకుని మద్యం ధరలు పెంచారన్నారు. ఏటా రూ.3 వేల కోట్లు చంద్రబాబు జేబులోకి వెళ్ళబోతున్నాయని చెప్పారు. వాట్సాప్ ద్వారా లిక్కర్ డోర్ డెలివరి అవుతుందని రాష్ట్ర ప్రజలను చంద్రబాబు గాలికి వదిలేశారని తెలిపారు.

## పచ్చని పైరును గడ్డి ముందు కొట్టి ధ్వంసం చేశారు

*(మొదటి పేజీ తరువాయి)*

తనపై కక్ష కట్టి తన రెండు ఎకరాల పొలంలో గడ్డి ముందు కొట్టి పంటను ధ్వంసం చేశారని బాధితుడు తెలిపాడు. గతంలో స్థానిక తహసిల్దార్‌ను సంప్రదించగా, ఆ పొలం సాగు చేసుకోమని తెలిపారని చెప్పారు. దీంతో ఎప్పటి లాగానే ఈ ఏడాది కూడా వరి సాగు చేపట్టానని తెలిపారు. పంట వారం రోజుల్లో చేతికి వస్తుందన్న తరుణంలో ఉప్పు రమణయ్య, వేముల సుధాకర్, ఉప్పు ఏడుకొండలు, ఉప్పు తిరపతి అనే వారు గడ్డి ముందు కొట్టి పొలాన్ని ధ్వంసం చేశారని బాధితుడు ఆరోపించాడు. ఈ విషయంపై ఆ నలుగురు వ్యక్తు లపై జలదంకి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానన్నారు. జలదంకి పోలీసులు తన పొలాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని కోరారు.

# దేవరపాళెం, కొండ్లపూడి గ్రామాలలో పొలంబడి కార్యక్రమం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం, కొండ్లపూడి గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయధికారి ఎస్.వి నాగమోహన్ రైతులతో మాట్లాడుతూ.. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా (కేంద్ర ప్రభుత్వం) వారు మొత్తం అనగా దేశంలోని రైతులందరికీ ఒక యూనిక్ ఐడిని (11 అంకెలు కలిగింది) ఇవ్వబోతోందని, దీని ద్వారానే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఇతరత్రా అనగా గవర్నమెంట్ నుండి రైతులకు అందే ప్రతి స్కీమ్ ఈ ఐడి ఉంటే ఇవ్వటం జరుగుతుందని కావున ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని తెలియజేశారు. రిజిస్ట్రేషన్ కొరకు రైతులు మీ పాస్ బుక్ జీరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకుని గ్రామంలోని రైతు సేవ కేంద్రం ను సంప్రదించాలని తెలియజేశారు. ఇందుకు రైతు తప్పనిసరిగా తమ ఆధార్ లింక్ అయినా ఫోన్ నెంబర్‌తో కూడిన మొబైల్ తీసుకువెళ్ళాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు విష్ణు, స్థానిక నాయకులు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా లైన్‌కు మరమ్మత్తులు నిర్వహిస్తాం : ఏఈ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయితీ హై స్కూల్ రోడ్డు మండల ప్రజా పరిషత్ పాఠశాల వద్ద విద్యుత్ లైన్ వైర్లు క్రిందకి ఉండడంతో లారీ ట్రాక్టర్ వంటి వాహనాలు లోడు వేసుకొని పోవడానికి ఇబ్బందిగా ఉందని పాడి పరిశ్రమ రైతు నేతాజీ ఫిర్యాదు చేయడంతో స్పందించి బోగోలు మండల ఎలక్ట్రికల్ ఏఈ జదరాయ పరిశీలించి రైతులకు ఇబ్బంది కలవకుండా ఉన్న విద్యుత్ లైన్‌లను సరి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారి జదరాయ మాట్లాడుతూ.. విశ్వనాథరావుపేట పంచాయితీ హై స్కూల్ రోడ్ ఈ మధ్యకాలంలో సిమెంట్ రోడ్డు వేయడంతో 230 వాట్స్ విద్యుత్ లైన్ రోడ్డు క్రాస్ చేస్తున్న లైన్ బాగా క్రిందకి ఉండడంతో అటుగా పెద్ద వెహికల్స్ వెళ్లడానికి కష్టంగా ఉన్నందున కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి భారీ వాహనాలకు ఇబ్బంది లేకుండా చూస్తానని తెలిపారు. మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత లైన్‌మెన్‌కు విద్యుత్ కార్యాలయంలోని విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు.

# ఉపాధ్యాయినిగా ఉత్తమం

- రచయితగా నైపుణ్యం
- అంతర్జాతీయ కలంఛాంపియన్ కైవసం
- నాగేశ్వరమ్మకు సర్వజన అభినందనం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయినిగా అత్యంత అంకితభావంతో బోధనలు గావిస్తూ ప్రభుత్వం నుండి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న పార్లపల్లి నాగేశ్వరమ్మ రచయితగా రాణిస్తూ తన ప్రతిభతో అనేక పురస్కారాలు పొందడంతోపాటు ఆమె ప్రతిభ, నైపుణ్యాలతో అంతర్జాతీయస్థాయిలో కలంఛాంపియన్‌గా ఎంపికై అరుదైన పురస్కారాన్ని ఆన్‌లైన్ ద్వారా పొందగా ఆమెను సర్వత్రా అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఆత్మకూరు నియోజకవర్గం మర్రిపాడు మండలం పొంగూరుకు చెందిన రిటైర్డ్ టీచర్ పార్లపల్లి సుబ్బరాయుడు–రత్నమ్మల కుమార్తె కోలా శ్రీహరిరావు సతీమణి అయిన నాగేశ్వరమ్మ నెల్లూరులోని కార్పోరేషన్ స్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేస్తుంది. ఆమె అటు ఉపాధ్యాయవృత్తిలో కొనసాగుతూ తీరిక వేళ్ళల్లో అనేకానేక రచనలు చేస్తూ పలు సంస్థల నుండి ప్రశంశాపురస్కారాలు అందుకుంటూ ఆకాశవాణి రేడియో ద్వారా కూడా ఆమె కవితలు జనాలకు విన్పించారు. అనేక పత్రికల్లో ఆమె ప్రావీణ్యతారచనలను ప్రచురించారు. కాగా హైదరాబాదు కేంద్రంగా 'కలంస్నేహం' అనే ఒక సంగీత, సాహిత్య సామాజికసేవా సంస్థ అంతర్జాతీయ స్థాయిలో అనునిత్యం సాహితీవేత్తలను, సంగీత కళాకారులను ప్రోత్సహిస్తుంటారు. ఈ కలంస్నేహం సంస్థకు అనుబంధంగా కథాస్నేహం, స్వరస్నేహం, చిత్రస్నేహం, నాట్యస్నేహంలను సంస్థ అధ్యక్షుడు, సంగీతదర్శకుడు శ్రీమాన్‌గోపాల్‌ఆచార్య నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ అలంకారాలు, విసంధికలు, ప్రయాగ, మరోచరిత్ర, వేకువతార, శిశిరాలు తదితర అంశాలతో ప్రతి ఉదయం కవితా అంశం ఇచ్చి కవిత్వం రాసిన వారికి సాయంత్రానికి సమూహంలో ఫలితాలు వెల్లడి చేస్తుంటారు. ఈ సమూహంలో పార్లపల్లి నాగేశ్వరమ్మ అనతికాలంలోనే 50రచనలు చేసి అద్వితీయప్రతిభ కనబరిచారు. దాంతో ఆమెను కలంఛాంపియన్‌గా ఎంపికచేసి బిరుదుప్రధానం చేసిన శ్రీమాన్ గోపాలాచార్య ఆన్‌లైన్‌లో ప్రశంశాపత్రం అందజేశారు. ఆమె పలుదపాలు ఈసంస్థ ద్వారా బెస్ట్‌వన్‌ఆఫ్‌దివీక్‌గా ఎంపికచేసి పురస్కారాలు అందజేస్తుండేవారు. ఈదపా కలంఛాంపియన్‌గా బిరుదుప్రధానం చేయడంతో నాగేశ్వరమ్మ సంస్థ అధ్యక్షుడు గోపాలాచారి, జాతీయ గౌరవాధ్యక్షురాలు అరుణ కుమారి, ఉపాధ్యక్షురాలు హరిరమణి, జాతీయ ప్రధానకార్యదర్శి గీతాశ్రీస్వర్గం, జాతీయ కోశాధికారి సావిత్రీరవిదేశాయ్‌లకు నాగేశ్వరమ్మ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సాహిత్యాభిలాషతో తాను రచనలు చేస్తుండగా తనను ప్రోత్సహిస్తున్న సంస్థ ప్రతినిధులు తాను మరింతగా రచనలు చేసేందుకు సమాయత్తం చేస్తున్నారని పేర్కొన్నారు. తనకు కలంఛాంపియన్ బిరుదు రావడం అత్యంత సంతోషదాయకంగా ఉందని నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. ఈ బిరుదుపొందిన, ఏపి కాట్స్ జిల్లా ఉపాధ్యక్షురాలుగా కూడా అత్యంత చురుగ్గా ఉంటున్న నాగేశ్వరమ్మకు ఈ బిరుదు రావడం పట్ల పలువురు సహచర ఉపాధ్యాయులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, కాట్స్ ప్రతినిధులు బంధుమిత్రులు, అభిమానులు అభినందనలతో ప్రశంశలజల్లు కురిపించారు. ఆమె ప్రజ్ఞ, విధులపట్ల చిత్తశుద్ధి, నాయకత్వ పటిమ, భర్త, కుటుంబసభ్యులు, బంధుమిత్రుల ప్రోత్సాహంతో మరింతగా భవిష్యత్తులో ప్రోత్సాహకాలు, పురస్కారాలు, బిరుదులు పొందాలని వారంతా ఆకాంక్షించారు.

## తరగతులను విలీనం చేయవద్దని వినతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం దళితవాడ, గుడినరవ ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5వ తరగతులను గండిపాళెం మెయిన్, సున్నంవారిచింతల పాఠశాలలో విలీనం చేయవద్దని మంగళవారం పాఠశాల పీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవో–2 శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.

## పోలేరమ్మ జాతరలో పాల్గొన్న మాలేపాటి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి గ్రామంలో పాత ఊర్లోనే పోలేరమ్మ ఆలయంలో జరుగుతున్న జాతరకు జాతర కమిటీ రాష్ట్ర తెలుగుదేశం ఉపాధ్యక్షులు మాలేపాటి సుబ్బా నాయుడిని సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారి ఆహ్వానాన్ని అందుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కావలి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో రైతులు సస్యశ్యామలంగా ఉండాలని కోరారు అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వాక్సినేషన్ రివ్యూ సమావేశంలో..

# డాక్టర్ పి.ఉమామహేశ్వరి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఓ కావలి కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం జిల్లా అధికారుల రివ్యూ సమావేశాన్ని డాక్టర్ ఏ.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఇంటింటికి తిరిగి సర్వే చేసి గర్భవతులకు, పుట్టిన పురిటి బిడ్డలను గుర్తించి తగిన సమయంలో వేయవలసిన అటువంటి వ్యాక్సినేషన్లు తప్పనిసరిగా వారికి వేయాలని ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు ఆదేశాలు జారీ చేశారు. సరైన సమయంలో వాక్సినేషన్ వేసుకోవడం వల్ల అనేకమైన వైకల్యాలనుండి విడుదల పొందుతారని తెలిపారు. అనంతరం ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా వాక్సినేషన్ వేయించేందుకు సిబ్బంది అవేర్నెస్ కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మెడికల్ అధికారులు పాల్గొన్నారు.

## పారిశ్రామిక వాడల్లో బీసీలకు 50శాతం రాయితీ ఇవ్వాలి : మహేంద్ర యాదవ్




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వాడల్లో (ఏపీఐఐసీ)లో ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)లో కేటాయించే భూ విలువలలో బడుగు బలహీన వర్గాలకు (బీసీ) లకు 50శాతం సబ్సిడీ ఇవ్వాలని బీసీ నేత, బీజేపీ నాయకులు డాక్టర్ ఒంటేరు మహేంద్ర యాదవ్ అభిప్రాయ పడ్డారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే రాయితీ ఇస్తున్నారని, బీసీలకు కూడా అదే క్రమంలో సబ్సిడీ ఇచ్చి బడుగు బలహీన వర్గాలలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం బీసీల పార్టీగా చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు ప్రత్యేక పారిశ్రామిక చట్టం ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటు పడాలని కోరారు. నూతన ప్రభుత్వంలో కూడా గత ప్రభుత్వంలో ఉన్న పారిశ్రామిక పాలసీలే అమలు అవుతున్నాయని గుర్తు చేశారు. కొత్త పారిశ్రామిక విధానం ఏర్పాటు చేసి బీసీలకు ప్రత్యేక రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కావలి రెడ్‌క్రాస్‌కు రూ.1.50లక్షలు విరాళం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రెడ్‌క్రాస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం విశ్రాంత వైద్య ఆరోగ్య శాఖ అధికారి, రెడ్‌క్రాస్ జీవిత సభ్యులు సడ్డా నారాయణరెడ్డి దంపతులు రూ. 1.50 లక్షలు రూపాయలు విరాళం ఇచ్చారు. కావలి రెడ్‌క్రాస్ అధ్యక్షులు, ఆర్డీఓ ఎం.సన్నీ వంశీకృష్ణ రెడ్‌క్రాస్ తరపున ఈ విరాళం స్వీకరించి, దాత నారాయణరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. కావలి రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త కేంద్రం, తలసేమియా బాధిత చిన్నారుల వైద్యశాల, మరణానంతర సేవలు, విపత్తు నిర్వహణ తదితర సేవలు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో గుర్తింపు పొందాయని, త్వరలో కాన్సర్ నిర్ధారణ పరీక్షలు, కాన్సర్ నిరోధక వాక్సిన్ కేంద్రంను కావలి రోటరీ క్లబ్ సహకారంతో ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. రెడ్‌క్రాస్‌కు సహకరిస్తున్న దాతలను అయన అభినందించారు. దాత సడ్డా నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. తాను గత 25 సంవత్సరాల నుండి రెడ్‌క్రాస్‌లో సభ్యునిగా కొనసాగుతూ, పలు గ్రామాలలో రక్తదాన శిబిరాలు నిర్వహించానని అన్నారు. తన సతీమణి తనూజరెడ్డి కోరిక మేరకు ఆమె సోదరి చిన్నపురెడ్డి భువనేశ్వరి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ నిర్వాహకులు డి.రవిప్రకాష్, కలికి శ్రీహరిరెడ్డి, కె.హరినారప రెడ్డి, బిఎస్ ప్రసాద్, ఆక్వా వ్యాపారి భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పై స్పెషల్ డ్రైవ్



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మంగళవారం బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని పంచేడు రైతు సేవా కేంద్రంలో రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ) గురించి స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిని పి.సత్యవాణి మాట్లాడుతూ.. రబీ 2024-25 సంవత్సరానికి గాను జిల్లాలో దాదాపు మూడు లక్షల 66వేల ఎకరాలలో పంటల సాగు చేయడం జరిగిందని తెలియజేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులదగ్గర నుంచి అభ్యర్థనలు వస్తున్నాయి కనుక జాయింట్ కలెక్టర్, కలెక్టర్, అగ్రికల్చర్, డిఎం సివిల్ సప్లయిస్, కోపరేటివ్ సొసైటీల ద్వారా గత నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. దాదాపు జిల్లాలో 297 రైతు సేవా కేంద్రాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. జిల్లాలో11లక్షల మెట్రిక్ టన్నుల పంట చేతికి రావడం జరుగుతుందన్నారు. కెఎన్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048 రకాలు ప్రధానంగాసాగుచేయడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం ఓపెన్ మార్కెట్లో పుట్టి దాన్యం 21వేలనుంచి24వేలవరకు రేటు ఉందన్నారు. ఈ సంవత్సరం కూడా ఇలాగే రేట్లు ఉండవచ్చును అన్నారు. ధరలు తగ్గినట్లయితే రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వారి ధాన్యాన్ని అమ్ముకోవచ్చునని తెలియజేశారు. నిర్దేశిత ప్రమాణాల ఆధారంగా రైతుల ధాన్యాన్ని దాన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయడం జరుగుతుందని తెలియజేశారు.

## మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే..

# చట్టపరమైన కఠిన చర్యలు : డీఎస్పీ రామారావు





**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** సమాజంలోని మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అమర్యాదగా అసభ్యంగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కే.సిహెచ్ రామారావు తెలిపారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మంగళవారం దర్గామిట్టలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, మహిళలు, బాలబాలికల సంరక్షణ చర్యలు, బాల్య వివాహాలు, ఫోక్సో యాక్ట్, మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల దుర్వినియోగం, చైల్డ్ పోర్నోగ్రఫీ, సైబర్ క్రైమ్‌లపై కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. ఏసుదాసు, సెట్నెల్ సీఈఓ నాగేశ్వరావు, మహిళ పోలీస్ స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి, (ఏహెచ్‌టీయు) యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏఎస్ఐ వై.శ్రీహరి, సిబ్బంది కె.ప్రసాద్, టీవీఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూనిక్ ఐడీ..

# ప్రభుత్వ పథకాల కోసం తప్పనిసరి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరు, చెముడుగుంటలో వ్యవసాయ శాఖ పొలంపిలుస్తోంది కార్యక్రమంలో రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ యుఐడీ)పై అవగాహన కల్పించారు. రైతులు ఆధార్‌కార్డు, ఆధార్-లింక్ మొబైల్, పట్టాదారు పాసుబుక్ తీసుకుని రైతు రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ఈ యుఐడీ ద్వారా అన్నదాత సుఖీభవ, రాయితీలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాలు లభిస్తాయి. అధికారులు నత్రజని ఎరువుల తగ్గింపు, సుడి దోమ నివారణ కోసం పెక్సలాన్ మందు పిచికారీ చేయాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఈ-పంట పోర్టల్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

## మార్చి ఆఖరికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పక్కాగృహాలు మంజూరైన లబ్దిదారులు మార్చి అఖరి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎంవీ మోహన్రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గండి పాళెం గ్రామంలో లబ్దిదారులు నిర్మించుకుంటున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో ఏఈలు, వర్కుఇనస్పెక్టర్లు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుత్తేదారులు నిర్మించేవిలబ్దిదారులు సొం తంగా నిర్మించుకుంటున్న ఇళ్లను మార్చి అఖరి నాటికి పూర్తి చేయాలన్నారు. పూర్తి చేయకపోతే రద్దయ్యే అవకాశవ ముందన్నారు. ఏప్రిల్ నుంచి అప్షన్-2.0 అమల్లోకి వస్తుందన్నారు. అలాగే గోదాముల్లో నిల్వ ఉన్న సిమెంట్, స్టీల్ను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈ పీరాన్, ఏఈ రామ కృష్ణ వర్కు ఇన్‌స్పెక్టర్ మల్లు హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు పరీ క్షలకు ముందు పాటించాల్సిన నియమాలను సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నూర్జహాన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలు, ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తత అవసరం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితిలో సైబర్ మోసాల బారినపడకుండా ఎలా ఉండాలి? అనే అంశంపై విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యు)లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచనల మేరకు వీఎస్‌యూ, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ, ఎన్‌ఐసి సంయుక్తంగా 'సేఫర్ ఇంటర్నెట్ డే-2025' ను నిర్వహించారు. సైబర్ మోసాల పెరుగుదలపై ఉపకులపతి హెచ్చరిక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు మాట్లాడుతూ.. ఇంటర్నెట్ వినియోగం అనివార్యమైనప్పటికీ, సురక్షిత పద్ధతులను పాటించడం అవసరమని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధికంగా యూపీఐ లావాదేవీలు జరుగుతున్న దేశం భారత్ కావడంతో, సైబర్ మోసాలకు గురయ్యే అవకాశాలు పెరుగుతున్నాయని అన్నారు. యువత తక్కువ కష్టంతో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశలో మోసపోతున్నారు. ఫోన్ కాల్స్, ఫేక్ లింక్స్ ద్వారా మోసగాళ్లు వ్యక్తిగత డేటాను దొంగిలిస్తున్నారు' అని ఆయన హెచ్చరించారు. సురక్షితమైన ఆన్‌లైన్ లావాదేవీల కోసం ముఖ్య సూచనలను తెలియజేశారు. ఓటీపీ, సీవీవీ బ్యాంక్ అకౌంట్ నెంబర్లు ఎవరితోనూ పంచుకోవద్దు. లాటరీ గెలిచారు, గిఫ్ట్ వస్తుందని చెప్పే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు. ప్రమాదకర లింకులు, ఫేక్ వెబ్‌సైట్‌లపై క్లిక్ చేయకూడదు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయాలి. సైబర్ నేరాలపై అవగాహనలో ఎన్‌ఐసి సమాచార అధికారి వి.సురేష్‌బాబు సైబర్ మోసాలను గుర్తించే విధానాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తూ, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ద్వారా జరుగుతున్న మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ క్రైం ఎస్ఐ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ అధికారులుగా నటించి డబ్బులు దోచుకుంటున్నట్లు వివరించారు. ఏదైనా అనుమానం వస్తే బ్యాంకు అధికారిక హెల్ప్‌లైన్ లేదా 1930 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య అందె ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ప్రముఖ కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలు మన కుటుంబ సభ్యులు



## పుస్తక మిత్ర గ్రంథాలయం ప్రారంభం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** ఇంట్లో కుటుంబ సభ్యులతో బంధం ఉన్నట్లే, పుస్తకాలతో అనుబంధం పెంచుకుంటే విద్యార్థి దశ నుండే జీవితం ఆనందంగా, ప్రశాంతంగా ఉంటుందని బుచ్చిరెడ్డిపాలెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.శ్రీహరి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పెద్దూరు బెజవాడ బుజ్జమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మిత్ర గ్రంధాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు పుస్తకాలు చదవడం వలన మహనీయుల జీవిత చరిత్రతో స్ఫూర్తి పొంది ఉన్నత స్థానానికి చేరుకుంటారన్నారు. మండల విద్యాశాఖ అధికారులు ఎస్వీ నాయక్, పీవీరత్నం మాట్లాడుతూ.. నిరంతరం విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వలన విజ్ఞానము, వికాసం, విచక్షణ, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయన్నారు. నిస్వార్థంగా పిల్లల కోసం పుస్తకాలు అందజేస్తూ సేవలందిస్తున్న ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల చేత ప్రతిరోజు ఒక గంట పాటు పుస్తకాలు చదువుతామని ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుజాత, జిల్లా రిసోర్స్ గ్రూప్ సభ్యులు గండికోట సుధీర్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా దీన దయాల్ ఉపాధ్యాయ వర్ధంతి సభ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బీజేపీ పూర్వపు జన సంఘం సిద్ధాంతకర్త దీందాయ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమం మూలపేట అలంకార్ సెంటర్లో బీజేపీ శ్రేణులు నిర్వహించాయి. 1963లో దీనదయాల్ ఉపాధ్యాయ నెల్లూరు వచ్చినప్పుడు ఆయన సన్మాన కార్యక్రమం పాల్గొన్న నారాయణ భగవాన్‌సింగ్ గత స్మృతులు గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ.. గత 43 సంవత్సరాలుగా ధర్మ మార్గం గాను ఆధ్యాత్మిక విలువలతో కూడిన అందరూ బాగుండాలి అనే ఏకాత్మతా మానవతావాదం సిద్ధాంతాన్నికి ఆకర్షితులై బీజేపీలో కొనసాగుతున్నామన్నారు. రాజకీయాలలో అనేక మార్పులు వస్తున్న సందర్భంగా పార్టీలో పదవులు ఉన్నా లేకున్నా సిద్ధాంతం కోసం జీవితంలో చివరి క్షణం వరకు మరణించే వరకు ప్రజలకు సేవ చేస్తూనే ఉంటాను అని రమేష్ తెలిపారు. ధర్మాన్ని కాపాడడం కోసం సమాజ అభివృద్ధి కోసం కార్యకర్తలు ఉపాధ్యాయ సిద్ధాంతాన్ని అనుసరించాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి మాట్లాడుతూ.. దీన దయాల్ గొప్ప తత్వవేత్త. దేశ మూలాల్లోకి వెళ్లి ఏకాత్మత మానవతావాదం సిద్ధాంతాన్ని రూపొందించారు. ఆ పార్టీలో పని చేయడం ఆనందంగా ఉందన్నారు. యువర్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ ఈ దేశంలో చిట్ట చివరి పేదవానికి సైతం కూడు గుడ్డ గూడు అందించే లక్ష్యంగా అంత్యోదయ సిద్ధాంతాన్ని దీన దయాల్ రూపొందించాలని ఆయన సిద్ధాంతం మాకు మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిత్తాతూర్ పద్మవతి, నాగలక్ష్మి, అల్లూరు నాగేంద్ర సింగ్, కళ్ళు సరస్వతి, మనో శ్రావ్య, జనార్ధన్ యాదవ్, విజయలక్ష్మి, వీర రాఘవులు, నీలి శెట్టి లక్ష్మణరావు. శ్రీనివాసులు, బాబు, పూనపల్లి రామకృష్ణ, ఎడవల్లి సురేష్, నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.

## పోలమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మంగళవారం మండల పరిధిలోని కుడితిపాలెం పెద్దసంగంలో రేవుల పోలమ్మ (60) మృతి చెందడం జరిగింది. ఈ కుటుంబానికి ఆర్థిక సాయంగా ప్రశాంతమ్మ స్ఫూర్తితో స్థాపించిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దొడ్ల మల్లికార్జున్ రూ.5వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శేషయ్య, వెంకయ్య, టీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వజ్రమ్మ పార్థివదేహానికి పలువురు నివాళి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** అనారోగ్య కారణంగా మృతి చెందిన బుచ్చిరెడ్డిపాళెం మండలం, రెడ్డి పాళెంకు చెందిన వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కొటింరెడ్డి రాఘవ రెడ్డి మాతృమూర్తి కొటింరెడ్డి వజ్రమ్మ పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట బుచ్చిరెడ్డిపాళెం మండల పార్టీ అధ్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు బాల శంకర్‌రెడ్డి, మొర్ల భారత్ ఉన్నారు.

## ఎక్స్కవేటర్ ముళ్లచెట్ల తొలగింపు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద వాహన రాకపోకలకు అడ్డంకిగా మారిన ముళ్లచెట్లను ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డి ఎక్స్కవేటర్‌తో మంగళవారం తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్ సర్కిల్ ప్రాంతంలో మలుపు ఉండడంతోపాటు చెట్లు ఏపుగా పెరిగి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకొంటాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ముళ్లచెట్లను తొలగించడంతోపాటు వేగని రోధకాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వాహనదారులు అతివేగంగా వాహనాలను నడపకుండా ట్రాపిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

## రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య కేటాయింపు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** భూములు కలిగిన ప్రతి రైతుకు ఆధార్ తరహాలో ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండిపాళెం, గుడినరవ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఇకపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, రాయితీలు పొందాలంటే రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరన్నారు. రైతులు పొలం పత్రాలతో ఆయా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి 11 అంకెల గల విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

# ఎదుగుదల తక్కువగా ఉన్నవారికి తగు సాయం

**ఇంటింటాన్యాయప్రచారం : న్యాయమూర్తి గాయత్రి**

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఇంటింటా న్యాయప్రచార కార్యక్రమం నిర్వహించి 18 సంవత్సరాలలో వయసున్న వారిలో ఎదుగుదల తక్కువగా ఉన్నవారిని గుర్తించి ఆ జాబితాలను పంపడం ద్వారా తగు సాయమందిస్తామని ఆత్మకూరు సీనియర్ సివిల్‌జడ్జి, మండల న్యాయసేవా అధికార సంఘం కార్యదర్శి బి.గాయత్రి పేర్కొన్నారు. మంగళవారం ఆమె పలువురు కమిటీ సభ్యులతో కలిసి ఆత్మకూరు పట్టణంలోని 80కుటుంబాల్లో పర్యటించి పరిశీలించి 20మంది ఎదుగుదలలోపాలున్న వారిని గుర్తించారు. డిల్లీకి చెందిన జాతీయన్యాయ సేవా అధికార సంస్థ, అమరావతిలోని రాష్ట్ర న్యాయసేవా అధికారసంస్థల ఆదేశాలమేరకు జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా అధికారసంస్థ చైర్మెన్ సి.యామిని సూచనలతో ఆత్మకూరులో న్యాయమూర్తి గాయత్రి ఆధ్వర్యంలో ఇంటింటాన్యాయప్రచారం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి గాయత్రి మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఇంటింటాన్యాయప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 20బృందాలుగా ఏర్పాటు జరిగిందన్నారు. ఒక్కో టీమ్‌లో ఒక ప్యానల్‌న్యాయవాది, ఒక పారాలీగల్‌వాలెంటీర్, ఒక ఏఎన్ఎం, ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక ఆశాకార్యకర్త, ఒక వైద్యాధికారి, భవిత సెంటర్ నిర్వాహకులు ఉంటూ కార్యక్రమం నిర్వహిస్తారని ఆమె వివరించారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని గాయత్రి కోరారు. గుర్తించబడిన ఎదుగుదల తక్కువగా ఉన్నవారికోసం జాతీయన్యాయసేవా అధికారసంస్థ (నల్సా) బాలల సంరక్షణకోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2024, మానసిక అనారోగ్యం ఉన్నా, మేథోవైకల్యాలున్నవారున్నా చట్టపరమైన సేవలపథకం 2024 పథకాలను



చిన్నారులను పరిశీలిస్తున్న సీనియర్‌సివిల్‌జడ్జి బి.గాయత్రి

ప్రవేశపెట్టిందన్నారు. వికలాంగుల హక్కులచట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణచట్టం 2017, జాతీయమానసిక ఆరోగ్యవిధానం 2014, బాల్యవివాహాలు, లీగల్‌సర్వీసెస్ హెల్ప్‌లైన్‌నెంబర్ 15100, చైల్డ్‌హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్‌నెంబర్ 14456, ఉచిత న్యాయసహాయం తదితర అంశాల గురించి న్యాయమూర్తి గాయత్రి ఇంటింటా న్యాయప్రచారంలో అందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎదుగుదల తక్కువగా ఉన్నట్లుగా గురించిన 20మందిని నెల్లూరులోని జిల్లా సత్వరచికిత్సకేంద్రం, జిల్లా బాలభవిత కేంద్రంలను సంప్రతించాలని ఆమె సూచించారు. ఏదేని సమస్యలుంటే జిల్లా న్యాయసేవా అధికారసంస్థ దృష్టి తేవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పారాలీగల్ వాలెంటీర్లు, ఏఎన్ఎంలు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, భవితసెంటర్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరును కప్పేసిన మంచుదుప్పటి



ఆత్మకూరులో మంగళవారం ఉదయం 9గంటల సమయంలో కమ్ముకొని ఉన్న మంచు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో మంగళవారం ఉదయం 9గంటలవరకు కూడా మంచు దట్టంగా కమ్ముకొని వాహనాలవారికి, పాదచారులకు అత్యంత అసౌకర్యంగా మారింది. కొంతకాలంగా అధికంగా మంచు కురుస్తుండడం, చలి విపరీతంగా ఉంటోంది. నాలుగురోజులుగా మంచు కొంతమేరకు తగ్గినట్లుగా ఉండగా మంగళవారం మాత్రం అధికంగా మంచు కమ్ముకుంది. ఎదురెదురు వాహనాలు కూడా కన్పించకుండా ఉదయం 9గంటల సమయం దాటి సూర్యుడు కొంతమేరకు పైకి వచ్చినా రోడ్డుమీద దట్టమైన పొగమంచుతో చిమ్మచీకట్లను తలపించసాగింది. 10గంటలకు కానీ ఒకరకంగా వాహనాలు కన్పించే పరిస్థితి లేకపోయింది. అధికంగా ఉన్న ఈ మంచుతో జనజీవనానికి కూడా తీవ్ర అసౌకర్యం ఏర్పడింది.

# ప్రతిరైతుకు విశిష్టగుర్తింపు నెంబర్ కేటాయింపు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతిరైతులకు ఆధార్‌కార్డులాగా విశిష్టగుర్తింపు నెంబర్ కేటయించనున్నామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు. ఆత్మకూరులోని వ్యవసాయమార్కెట్ యార్డు ఆవరణలో స్థానిక సబ్ డివిజన్‌లోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల రైతుసేవాకేంద్ర సిబ్బందికి రైతురిజిస్ట్రీపోర్టల్, రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు నెంబర్ కేటాయింపు గురించి అవగాహనా సదస్సు నిర్వహించారు. ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ముఖ్యఅతిధిగా హాజరైన జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి ప్రసంగించారు. సిబ్బంది తమ సచివాలయం పరిధిలో ప్రతి రైతుకు రైతు రిజిస్ట్రీపోర్టల్‌లో ప్రత్యేక విశిష్టగుర్తింపునెంబరు గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ గుర్తింపు సంఖ్య పొందిన రైతులు ప్రభుత్వ వ్యవసాయపథకాలు, సబ్సిడీలు, తదితర సేవలు పొందవచ్చన్నారు. పంటలభీమా కూడా పొందవచ్చని సత్యవాణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ వ్యవసాయ సహాయ సంచాలకులు పి.శేషగిరిరావు రైతులను విశిష్టగుర్తింపునెంబరుకు నమోదు చేసే విధానాన్ని వివరించారు. మరో ఏడిఏ సి.నర్సోజీరావు, స్థానిక ఏడిఏ దేవసేనమ్మ, ఆత్మకూరు, అనంతసాగరం మండల వ్యవసాయాధికారులు కె.కిషోర్‌బాబు, పి.శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల ఆర్ఎస్‌కె సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మకూరు పట్టణంలో తీవ్రంగా గోమాతల బెడద






**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో గోమాతల బెడద తీవ్రంగా ఉంటూ అందరికీ ఇబ్బందికరంగా, అసౌకర్యంగా ఉంటోంది. పట్టణంలో ఎక్కడ చూసినా గుంపులుగా ఆవులు ఉంటున్నాయి. ప్రధానరహదారిపై ఎక్కడబడితే అక్కడే ఆవులు అధికంగా ఉంటూ వాహనాల ట్రాఫిక్‌కు తరచూ అంతరాయంగా ఉండడంతో పాటు పాదచారులు భయాందోళనకు గురవుతుంటారు. ద్విచక్రవాహనాకారులు కూడా ఆవుల వలన ఇబ్బందిపడుతుంటారు. స్కూళ్ళకెళ్ళే విద్యార్థులు ఆవులను చూసి ఆందోళన చెందుతుంటారు. కొన్ని ఆవులు దుకాణాల్లో దూరి పలు వస్తువులను లాగేస్తుంటాయి. ద్విచక్రవాహనాలకు ఏదేని లగేజి తగిలించి ఏమాత్రం ఆదమరిచినా ఆవులు లాగి పడేస్తుంటాయి. అనేక వస్తువులు, కూరగాయలు, పండ్లు తదితరాలను లాగిపడేస్తుండడంతో అవి పనికిరాకుండా పోతున్నాయి. కొందరు యజమానులు ఈ ఆవులను ఇళ్ళవద్ద ఉంచకుండా వదిలేస్తున్నందున అవి పట్టణమంతా కలియదిరుగుతూ ప్రధానరహదారిపై రోడ్డుమధ్యలో తిష్టవేస్తూ ఇబ్బందికరంగా ఉంటోంది. ఆత్మకూరులో కోతులు, కుక్కల బెడదతోపాటు ఆవుల బెడద కూడా తీవ్రంగా ఉందని, అత్యంత అసౌకర్యంగా, ఆందోళనకరంగా ఉంటుందని సర్వత్రా వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పన్నులు సకాలంలో చెల్లించండి

- పట్టణ అభివృద్ధికి సహకరించండి
- మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్



**కావలి మేజర్‌న్యూస్ :** కావలి పట్టణ ప్రజలు 2024-25 ఆర్థిక సంవత్సరంకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, ఇంటి పన్ను, ఖాళీ స్థలం, పన్నులను, నీటి పన్నులను వెంటనే చెల్లించి కావలి పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. శ్రావణ్ కుమార్ తెలిపారు. అలాగే దగ్గర్లో ఉన్న మీసేవ కేంద్రం నందు, వార్డు సచివాలయంలో లేక ఆన్లైన్ ద్వారా కానీ మున్సిపల్ ఆఫీస్ నందు గాని చెల్లించి తగు రసీదు పొందవలెనని తెలిపారు. అట్లా లేని యెడల ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1965 మేరకు కొళాయి కలెక్షన్లు తొలగించడంతోపాటు ఆస్తులను జప్తు చేయబడునని తెలిపారు. కాబట్టి ప్రజలు ప్రజలు మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తారని విజ్ఞప్తి చేశారు.

# దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు అందరికి ప్రేరణ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతీయజనసంఘ్ వ్యవస్థాపకులు పండిట్‌దీనదయాళ్ ఉపాధ్యాయ సిద్ధాంతాలు, త్యాగం, ఆలోచనలు అందరికి ప్రేరణ అని ఆత్మకూరు పట్టణ బిజెపి అధ్యక్షుడు నున్నా సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులో సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి నాయకులు దీనదయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా బిజెపి నాయకులు ప్రసంగిస్తూ దీనదయాళ్ ఆలోచనలు, సిద్ధాంతాలు అందరికీ ప్రేరణ అని, ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం అభివృద్ధి అంటే ఆర్థిక పురోగతితోపాటు దేశం యొక్క అధ్యాత్మిక మరియు సాంస్కృతిక బలం పెరిగేలా ఉండాలన్నారన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు కుదుముల సుధాకర్‌రెడ్డి, కరటంపాటి సుధాకర్, ఏలూరు



రాజగోపాల్‌రెడ్డి, కొల్లి శ్రీనివాసులునాయుడు, వాయుగుండ్ల ఉమాశంకర్, పలువురు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బృహత్తర త్రాగునీటి పథకానికి మహత్తర పురోగతి

**▶▶ నిధులు సాధించిన మంత్రి ఆనం**

**▶▶ త్వరలో పనులు ప్రారంభం**



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో గతంలో రాష్ట్ర ఆర్థికశాఖామంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి సాధించిన బృహత్తర త్రాగునీటి పథకానికి ఆనం చొరవతో మరింతగా పురోగతి రానుంది. త్వరలో అమృతధార2 ద్వారా 9.2కోట్ల రూపాయలు నిధులతో పనులు ప్రారంభం కానున్నాయి. ఆత్మకూరు పట్టణంలో దశాబ్దాల తరబడి వారానికి ఒకరోజే త్రాగునీరు అందించే పరిస్థితి ఉండేది. 2012లో అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితిని గమనించి ఆత్మకూరును మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయించారు. అనంతరం రామనారాయణరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికశాఖామంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు నియోజకవర్గానికి దాదాపు 2500 కోట్ల రూపాయలతో అనేక హాస్పిటల్స్, విద్యాసంస్థలు, సాంకేతికవిద్యాసంస్థలు, రోడ్లు, భవనాలు, వంతెనలు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించారు. అప్పట్లో ఆత్మకూరులో శాశ్వతతాగునీటిని అందించే లక్ష్యంగా రామనారాయణరెడ్డి 65.70కోట్ల రూపాయలతో అతిపెద్ద త్రాగునీటిపథకాన్ని మంజూరు చేయించారు. ఆత్మకూరులో పెద్ద వాటర్‌ప్లాంటు నిర్మించేలా, సోమశిలలో ప్రాజెక్టువద్ద నుండి ఆత్మకూరులో ప్లాంటుకు తాగునీరు చేరేలా 2103లో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, ఎన్.రఘువీరారెడ్డి, పితాని సత్యనారాయణ, మానుగుంట మహీధర్‌రెడ్డిలు శంఖుస్థాపనగావించారు. పనులు పూర్తయ్యాక 2016లో అప్పటి మంత్రులు పొంగూరు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, అమర్నాథరెడ్డిలు ప్రారంభించారు. ప్రతినిత్యం సోమశిల ప్రాజెక్టునుండి 50లక్షల లీటర్ల నీరు ఆత్మకూరు ప్లాంటుకు చేరుతుంది. ఇక్కడ వివిద సాంకేతిక విధానాలతో ఆలమ్, క్లోరిన్‌లు కలిపి ఆనీటిని శుద్ధిచేస్తారు. అనంతరం ఆ నీటిని మున్సిపల్ పరిధిలోని 11ఓవర్‌హెడ్ ట్యాంకులకు పంపుతారు. ఆ ట్యాంకులనుండి కొళాయిల ద్వారా ప్రజలకు తాగునీటిని సరఫరాచేస్తుంటారు. కాగా 9నెలల క్రితం ఆత్మకూరు ఎమ్మెల్యేగా ఎన్నికై రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులో ప్రజలకు రెండురోజులకు ఒకదపానే తాగునీటిని సరఫరాచేస్తున్నారని గమనించారు. వెంటనే అధికారులతో సమీక్ష జరిపి ప్రతిరోజూ అందరికీ సమృద్ధిగా తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దాంతోపాటు మంత్రి ఆనం ఇక్కడ తాగునీటి పరిస్థితిని మంత్రి పొంగూరు నారాయణ దృష్టికి తీసుకెళ్లగా అమృతద్వారా 9.2కోట్ల రూపాయల మంజూరుకు హామీ ఇచ్చారు. త్వరలోనే ఈపనులకు శ్రీకారం చుట్టాలని మంత్రి రామనారాయణరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఈ 9.2కోట్లనిధులతో ఇక్కడున్న బృహత్తర తాగునీటిపథకం మరింతగా స్తాయిపెంచుకొని మున్సిపల్ పరిధిలోని అందరికీ ప్రతినిత్యం సమృద్ధిగా తాగునీరు అందగలదని, ఆనం అంటేనే అభివృద్ధి కదా అని సర్వత్రా వ్యాఖ్యానిస్తూ సంబరపడుతున్నారు.

# అధ్యాపకులు విరివిగా ఆటల్లో పాల్గొనాలి : దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఫిబ్రవరి 6న విక్రమ సింహపురి పరిధిలో డిగ్రీ, పీజీ కళాశాల అధ్యాపక బృందానికి విశ్వసిద్యాలయం వారు నెల్లూరులో ఆటలపోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా రాణించి విజయం సాధించారు. అనంతరం అధ్యాపకులు ఉద్దేశించి వ్యవస్థాపకులువిట్స్ కాలేజ్ కరెర్పొండెంట్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకులు ఆటల పోటీల్లో పాల్గొనాలని ఆరోగ్య రీత్యా, శారీరక దృఢత్వం కోసం విజయం సాధించడం ముఖ్యం కాదు కానీ క్రీడల్లో పాల్గొనడమే ముఖ్యమని జయ, అపజయాలు సర్వసాధారణమని తెలిపారు. అనంతరం విజయం సాధించిన అధ్యాపకులు ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.సుధాకర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ ఆర్. మాల్యాద్రి గెలుపొందిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజేతలు టెన్నిస్ సింగల్ విన్నర్ కాలేజీ పీడీ డాక్టర్. ప్రసాద్‌రెడ్డి, రమణారెడ్డి ఎస్‌కే అయూబ్, మహిళల త్రో బాల్ పోటీలలో అశ్విని మ్యాథమెటిక్స్ లెక్చరర్‌గా, ప్రతిష్ట జువాలజీ లెక్చరర్‌గా పనిచేయుచున్నారు. అలాగే కాలేజీ పీడీ ప్రసాద్ రెడ్డి, పోటీలలో విజయం సాధించడం విశేషం.

# ఆమంచర్ల పంచాయతీని అభివృద్ధి చేస్తాం

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 7నెలల్లోనే ఆమంచర్ల గ్రామానికి కోటి 50లక్షల రూపాయల నిధులను నెల్లూరు రూరల్ నియోజకవర్గం శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. గత 3ఎన్నికల్లో పార్టీలకు అతీతంగా, నన్ను ఆదరించి మెజారిటీలు ఇచ్చిన గ్రామం ఆమంచర్ల గ్రామం అని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్నికలవేళ మాత్రమే పార్టీ జెండాలు, అజెండాలు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలు ఉండవు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కందుకూరు రమణమ్మ, ఉపసర్పంచ్ మలినేని వేణు నాయుడు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు అల్లాభక్షు, టీడీపీ నాయకులు వాకా వెంకటేశ్వర్లు, నెట్టెం చిరంజీవి నాయుడు, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్య రక్ష ద్వారా మెడికవర్‌లో మెరుగైన వైద్యం

**కోటంరెడ్డి సోదరుల సహాయంతో నలుగురికి మేజర్ ఆపరేషన్లు**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వెంగళరావు నగర్ తాతయ్య బడిలో కోటంరెడ్డి బ్రదర్స్ వారి ఆధ్వర్యంలో కన్వీనర్ దాట్ల చక్రధర్‌రెడ్డి నిర్వహణలో జరిగిన నారా లోకేష్ ఆరోగ్య రక్ష మెడికల్ క్యాంప్‌లో తదుపరి ట్రీట్మెంట్ కోసం 21మందిని మెడికోవర్ హాస్పిటల్‌కు తీసుకురావడం జరిగింది. కాన్సర్‌కు సంబంధించిన కేసులు 2, ఆర్థోకు సంబంధించిన కేసులు 6, హార్ట్‌కు కేసు 3, అస్మాకు సంభవించి 3, గర్భసంచికు సంబంధించి 3, న్యూరాలజికు సంభవించి 1, జనరల్ సర్జన్‌కు సంబంధించి 3. వారికి ఈసీజీలు ఎక్స్‌రేలు ఎంఆర్‌ఐలు, సీబీపీలు, అల్ట్రాసౌండ్, థైరాయిడ్‌లు, బ్లడ్ టెస్ట్ , టీఎండీ, 2డి ఎకోలతోపాటు మూడు మేజర్ సర్జరీలను నారా లోకేష్ ఆరోగ్య రక్ష ట్రస్ట్ ద్వారా పూర్తిగా ఉచితంగా చేయించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డికి కన్వీనర్ దాట్ల చక్రవర్షన్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులకు టెస్టులు, సర్జరీలు ఉచితంగా చేయించి నందుకుగాను పేషంట్లు, వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




# లైంగికదాడులపట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థినీలు లైంగికదాడులు, లైంగిక వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు సర్కిల్‌ఇన్స్‌పెక్టర్ జి.గంగాధరరావు సూచించారు. ఇటీవల జిల్లాలో జరిగిన ఒక లైంగికదాడి సంఘటనతో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలమేరకు, స్థానిక డిఎస్పి వేణుగోపాల్ పర్యవేక్షణలో మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో విద్యార్థినిలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో సీఐ గంగాధర్ మాట్లాడుతూ.. ఇటీవల లైంగికదాడులు అధికమయ్యాయని, అందరూ అప్రమత్తంగా ఉంటూ ప్రతిఘటించాలన్నారు. కాలేజిలవద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నమని ఆయన తెలిపారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగాడుతున్నా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా విద్యార్థినిలు గమనించాలని, వెంటనే కాలేజి ప్రిన్సిపాల్‌కు, పోలీసులకు సమాచారమివ్వాలని ఆయన సూచించారు. ఎవరైనా యువకులు అఘాయిత్యాలకు పాల్పడే పరిస్థితిని పసిగట్టి వెంటనే అప్రమత్తమై సమాచారమిస్తే వెంటనే స్పందించి సత్వర చర్యలు తీసుకుంటామని సిఐ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో స్వచ్చంద సంస్థ ప్రతినిధి వాగాల శ్రీహరి, కాలేజి విద్యార్థినిలు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

## కొమ్మలేరు వాగులో పడి యువకుడి మృతి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** వాగులో పడి కొట్టుకుపోతున్న తన తల్లిని కాపాడే ప్రయత్నంలో యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే ఉప్పలపాటి ఆకాష్ (21) కావలిలోని ఎస్‌ఆర్‌ఎస్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. తన తల్లిదండ్రులకు వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉండేవాడు. అయితే మంగళవారం సాయంత్రం తన తల్లితో పాటు పశువులకు గడ్డి తెచ్చేందుకు వాగు వద్ద గల పచ్చిక ప్రాంతానికి వెళ్ళాడు. గడ్డిని కోసే క్రమంలో అతని తల్లి వాగులో పడి కొట్టుకుపోయింది. గమనించిన ఆకాష్ వెంటనే తాను కూడా వాగులో దూకాడు. అక్కడే ఉన్న ఓ గిరిజన జాలరి ఆ మహిళను బయటకు లాగి రక్షించాడు. ఆపై తన కుమారుడి జాడ కానరాకపోవడంతో అప్పటికే అక్కడికి చేరిన కొందరి సహకారంతో వాగులో గాలించారు. వాగు నీటి అడుగున బురదలో కూరుకుపోయిన ఆకాష్‌ను వెలికి తీశారు. తనకు ఈత తెలియకపోయినా తనను కాపాడే క్రమంలో తన కుమారుడు మృతి చెందిన పట్ల ఆ తల్లి రోదన పలువురికి కంటతడి పెట్టించింది. కుటుంబానికి తన కుమారుడు అండగా ఉంటాడని ఎన్నో ఆశలతో కలలు కన్నా వారికి అనుకోని అకాల మరణం తీవ్ర దుఃఖాన్ని మిగిల్చింది. గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.

## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం గ్రామంలో మృతిచెందిన జీ.వేణు అంత్యక్రియలకు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, జీఎంకే ట్రస్టు అధినేత గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.10వేలు, మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య రూ.5వేల చొప్పున కుటుంబ సభ్యులకు మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. భవిష్యతలో వారి కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకొంటామని భరోసా ఇచ్చారు.

## రోడ్డుపై వెలసినతోపుడు బండ్ల తొలగింపు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** బుచ్చిపట్టణం చెన్నూరు రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్రఅంతరాయం కలుగుతుంది. దీంతో స్పందించిన నగర కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి సీఐ శ్రీనివాసులురెడ్డితో కలిసిరోడ్డుపై అడ్డంగా వెలసిన తోపుడు బండ్లలను తొలగించారు. రేపటిలోగాదుకాణా దారులు ఆక్రమణలు తొలగించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు పట్టణంలోని వ్యాపారస్తులు అందరూ సహకరించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు.



## మధ్యలో స్థంభాలు పెట్టి..
# సీసీ రోడ్డు నిర్మాణం !



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని రాపూర్ క్రాస్ వద్ద నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు చేస్తున్నటువంటి సీసీ రోడ్డు పనుల్లో మధ్యలో స్తంబాలు ఉంచి నిర్లక్ష్యంగా రోడ్డు నిర్మిస్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యమో, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారుల అలసత్వమో తెలియదు కానీ కాంట్రాక్టర్లు చేస్తున్న నిర్లక్ష్యంగా వున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అభివృద్ధి పనులు చేశామని చెప్పుకోవడానికి తూ తూ మంత్రంగా పనులు చేసేసి ఇలా స్తంభాలను రోడ్డు మధ్యలోనే వదిలివేయడాన్ని చూస్తుంటే అభివృద్ధి పనులపై కాంట్రాక్టర్లకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఉన్న ఆసక్తి ఇట్టే తెలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా సఖ్యతగా చేయాలని, స్తంభాలను పక్కకు జరిపి ఇబ్బందులు రాకుండా చూడాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు. రాపూరు పొదలకూరు క్రాస్ రోడ్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు రెండు నెలల నుండి సీసీ రోడ్ల నిర్మాణంలో కనిపించని ప్రభుత్వ అధికారుల జాడ, పనికి తీసుకువచ్చే మేస్త్రి వర్క్ ఇన్స్‌ఫెక్టర్లుగా, కాంట్రాక్టర్లే అధికారులుగా వ్యవహరిస్తున్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో నిర్వీర్యం చేసిన రోడ్డు పనులు కూటమీ ప్రభుత్వం ఏర్పడ్డాక పటిష్టంగా జరుగుతోందన్న తరుణంలో సీసీ రోడ్డుకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు జాడ కనిపించకపోవడంతో గత నాలుగు ఐదు నెలలో వేసినటువంటి రోడ్డు కలెక్టర్ గ్రాండ్ ద్వారా రెండు కోట్ల రూపాయలతో సైదాపురం బ్రిడ్జి నుండి రాపూరు క్రాస్ రోడ్డు వరకు చేసినటువంటి రోడ్డు మూడునాల ముచ్చటగా తయారైందని, దీని పట్ల ఆర్ అండ్ బి అధికారులు ఎవరూ కూడా పట్టీ పట్టనట్లు ఎవరిస్తున్నారని, అలాగే ప్రస్తుతం రాపూర్ క్రాస్ రోడ్డు నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు వేస్తున్నటువంటి సీసీ రోడ్డు హడావిడిగా వేస్తున్న తీరును గమనించిన వాహన దారులు, స్థానికులు, ప్రభుత్వ అధికారులు దగ్గరుండి రోడ్లు ఏపిస్తేనే అంతంత మాత్రం రోడ్లు ఉంటున్నాయని, 45 కోట్ల మేర కాంట్రాక్టు రోడ్డుపై ఏ అధికారి లేకపోవడంలో ఇది దేనికి సంకేతమని వాహనదారులు మండల ప్రజలు మండిపడుతున్నారు.




సూర్య

# విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

**కావలసిన సెంటర్లు**

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, వింజమూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

**నేటి దినపత్రిక సూర్య కార్యాలయం**
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

**9000118811, 9963827227**


# ఆస్తి పన్ను బకాయిల వసూళ్లను వేగవంతం చేయండి

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగర పాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను, షాపు రూముల బాడుగలు, పన్నుల వసూళ్లకై నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేసి, 100శాతం లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్య తేజ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ పరిపాలనా కార్యదర్శులను ఆదేశించారు. నెల్లూరు నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో కమాండ్ కంట్రోల్ విభాగంలో మంగళవారం వారాంతపు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు ప్రతిరోజు మిగిలిన కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించి నిర్దేశించిన పలు లక్ష్యాలను సాధించే దిశగా విధులను పంచుకొని పూర్తిస్థాయిలో పూర్తి అగునట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయ పరిధిలోని స్థానిక సమస్యలు పరిష్కారమయ్యేలా ప్రయత్నించాలని, అవసరమైన ఎడల ఉన్నతాధికారులకు తెలియజేసీ సమస్యను పరిష్కరించే విధముగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డు సచివాలయ కార్యదర్శులు అంతా విధుల నిర్వహణలో అత్యంత క్రమశిక్షణను పాటించాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా సాధించేలా కృషి చేయాలని తెలిపారు. పన్నుల వసూళ్లకు ప్రతిరోజు ఉదయం నుంచి క్షేత్రస్థాయిలో ఆస్తి పన్ను, నీటి చార్జీలు వసూళ్ళ కొరకు పర్యటించాలని సూచించారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించేందుకు వార్డు సచివాలయ అన్ని విభాగాల కార్యదర్శులను సమన్వయం చేసుకుని వ్యవహరించాలని సూచించారు. పన్ను బకాయిలు ఉన్న ప్రతి ఒక్క ఆస్తి యజమానికి నోటీసులు జారీ చేసి నిర్దేశించిన సమయంలోపు చెల్లించని పక్షంలో తాగునీటి కుళాయి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరికలు బకాయిదారులకు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని భవన యజమానులను ఫోన్ ద్వారా సంప్రదించి ఆన్లైన్ పేమెంట్ చేయించేలా తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అదేవిధంగా ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెల 31వ తేదీ నాటికి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోని కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొండి బకాయిదారులను గుర్తించి మున్సిపల్ చట్ట ప్రకారం వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సచివాలయం పరిధిలోని నూతన భవనములు, అదనపు నిర్మాణాలు చేపట్టి పూర్తి అయిన భవనములను కార్యదర్శులు గుర్తించి వాటిని ఆస్తిపన్ను పరిధిలోకి వచ్చేలా చర్యలు,అలాగే రెవిన్యూ ఇనిస్పెక్టర్లులు, అడ్మిన్, ఇన్చార్జి పరిపాలనా కార్యదర్శులుగా వున్న కార్యదర్శులు పన్ను వసూళ్లపై శ్రద్ధ వహించవలసినదిగా ఆదేశించారు. పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నందుకు పి.రమ్య - రామ్మూర్తి నగర్, ఎం.సాయిపూజ - ఆదిత్య నగర్, జె.జయలక్ష్మి - బర్మాషల్ గుంట వార్డు సచివాలయ ఇన్చార్జి పరిపాలనా కార్యదర్శులకు షోకాజు నోటీసులు జారీ చేయమని కమిషనర్ ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఇన్స్పెక్టర్లు, శరత్, సందీప్, వంశీదర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, శ్రావణ్, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమిషనర్‌ను కలిసిన డిప్యూటీ మేయర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.సూర్యతేజని నూతనంగా ఎన్నిక కాబడిన డిప్యూటీ మేయర్ సయ్యద్. తహసీన్ మంగళవారం నగర పాలక సంస్థలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నందు మర్యాద పూర్వకంగా కలిసి పూల బొకేను అందజేశారు.

## విడవలూరులో అపాధితుల ఆందోళన



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** రోడ్డు విస్తరణలో భాగంగా నివాస గృహాలను కోల్పోతున్న బాధితులు మంగళవారం విడవలూరు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విడవలూరులోని ఆర్ అండ్ బి రోడ్డు ఇరువైపులా కొన్ని సంవత్సరాలుగా సొంత గృహాలను ఏర్పాటు చేసుకొని నివాసం ఉంటున్నామని తెలిపారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇళ్లను కూల్చివేస్తామని నోటీసులు ఇవ్వడంతో తమ ఆందోళన చెందుతున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణకు తమ ఇళ్ళను ఇవ్వటం తమకు అంగీకారమైనప్పటికీ తమకు ప్రత్యామ్నాయ వసతులు కల్పించిన తర్వాతే తమ ఇళ్ళను తొలగించాలని వారు ఆందోళన చేపట్టారు. అంతేకాకుండా రోడ్డు విస్తరణకు అవసరమైన మేరకు మాత్రమే తమ నివాస గృహాలను తొలగించాలని కోరారు. అయితే అధికారులు మాత్రం రోడ్డు విస్తరణకు మించి తమ ఇళ్లను అన్యాయంగా తొలగిస్తున్నారని ఆందోళన చేపట్టారు. బాధితల ఆందోళన కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న విడవలూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సర్దు చెప్పి ఆందోళన విరమించే విధంగా చర్యలు తీసుకున్నారు.

## ఘనంగా పండిట్ దీనదయాల్ వర్ధంతి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** గొప్ప భారతీయ తత్వవేత్త, ఆర్థికవేత్త, చరిత్రకారుడు, పాత్రికేయుడు, సామాజికవేత్త, రాజకీయశాస్త్రవేత్త, భారతీయజన సంఘ్ పార్టీ పూర్వ అధ్యక్షులు, బీజేపీ పార్టీ సిద్ధాంతమైన ఏకాత్మ మానవతావాదం, అంత్యోదయను ప్రవచించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని పురస్కరించుకుని, బీజేపీ ఇందుకూరుపేట ఘన నివాళులు అర్పించింది. మండల పార్టీ అధ్యక్షులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేత్రంబాక శివప్రసాద్, అతిపాటి శరత్, వాకాటి ప్రసాద్, వాయిగండ్ల కృష్ణ, దొంతాల మహేష్, పునామల్లి వెంకటేశ్వర్లు, మేనాటి చంద్రశేఖర్, నెల్లూరు వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.